# శాపం

రాజమ్మ నడుస్తోంది వడివడిగా, వేగంగా నడుస్తోంది  చేతిలో సత్తు టిఫిను, దాన్నిండా కొడుక్కిష్టమయిన పదార్థాలు, అన్నం,

బుర్రనిండా ఆ రోజు తనకి జరిగిన అవమానం, కళంకం గూర్చిన ఆలోచన్లు, గుండెలనిండా మంటా - నింపుకుని నడుస్తోంది.

నడుస్తున్న రాజమ్మ ఇంటిని సమీపించింద. కాని అక్కడి వాతావరణం ప్రతిరోజులా లేదు. అక్కడి గాలి ఆందోళనతో నిండింది.

రాజమ్మకి గుండె ఆగినంత పనైంది. ఆమె ఇంటికి కాస్తదూరంలో జనం. విపరీతమైన జనం. అందరూ గుసగుసలాడుతున్నారు. పోలీసులు మధ్యలో. వాళ్ళందరికీ మధ్యలో ఒక చిన్నకారు - దాని క్రింద...

రాజమ్మ ఆదుర్దాగా దగ్గరకెళ్ళింది. ప్రక్కింటి సీతమ్మ ఒక్క ఉదుటు నొచ్చి రాజమ్మని చుట్టుకుంది.

"రాజమ్మా! నీ రాముల్లేడు - ఆ కారు ఆడిని మింగేసింది" అంది.

అంతే! రాజమ్మ మండుతున్న గుండె పేలిపోయింది.

రాములు - తన కొడుకు చనిపోయాడు - కారుకింద పడి.

చేతిలోని సత్తు టిఫిను పట్టుతప్పి కిందపడింది. కొడుకు కోసం తెచ్చిన అన్నం మట్టిపాలైంది.

పోలీసులు ఫోటోలు తీస్తున్నారు, కొలుస్తున్నారు, గీతలు గీస్తున్నారు. చాలా హడావిడిగా వున్నారు.

రాజమ్మ-కళ్ళకి చిల్లులు పడ్డట్టుగా ఏడుస్తోంది. ఏడుస్తూనే మెల్లిగా జనాన్ని తప్పించుకొని ముందుకెళ్ళింది.

రాములు బల్లిలా నేలకి అంటుకుపోయాడు. పొద్దున నవ్వుతూ పంపిన మొహం నామరూపాల్లేకుండా పోయింది. చక్రం తలమీంచి పోవటం వల్ల, అతడిని పోల్చుకోవటం కూడా కష్టం అనిపించింది.

రాజమ్మ ఘొల్లుమంటూ కూర్చుండిపోయింది. అందరూ సానుభూతి మాటలతో ఆమెని సముదాయించాలని ప్రయత్నిస్తున్నారు.

ఒక్కసారి కళ్లు తుడుచుకొని మళ్లీ కొడుకువంక చూసుకుంది. అక్కడి నుంచి చూపుని మరల్చి, కారువంక చూసింది కసిగా.

ఒక్కసారి ఒళ్లు ఝుల్లుమంది!

ఆ కారు తనకి తెల్సు. అది ఎవరిదో, దాని డ్రైవరెవడో తెల్సు తనకి.

ఆ కారు రంగరాజుది - తన యజమాని స్నేహితుడు. దానికి డ్రైవరెవడో కాదు - తన భర్త నాగయ్య.

కాని భర్తజాడ అక్కడెక్కడా కానరాక, మెల్లిగా అడిగింది - కార్లో ఎవరున్నారు? ఎవరూ చూళ్లేదా?" అని.

సీతమ్మ నిష్ఠూరంగా అంది. "చూడకేం తల్లీ! నేనిక్కడే కూర్చున్నా. ఏ మూలనించి వచ్చిందో పాడుకారు-ఆడిని మింగేసింది. ఆ కారులోవోడు యముడల్లే వున్నాడు. కళ్ళు సింతనిప్పుల్లా వున్నాయ్. తాగున్నాడేమో సచ్చినోడు - తూలాతున్నాడు. కారు దిగి ఏం జరగనట్లు వెళ్ళిపోయాడు. ఎదవసచ్చినోడు..." ఇంకేదో చెబుతూనే వుంది.

కాని రాజమ్మ వినటం లేదు. లేచి నుంచుంది.

ఆశ్చర్యం! ఇప్పుడామెకి కొడుకు పోయాడన్న దుఃఖం, దిగులు లేవు. వాటిస్థానంలో కసి, పగ నిండినాయ్.

ఆమె ప్రవర్తనకి అందరూ విస్తుపోయారు. "మతి చలించిదేమో" నన్నారు కొందరు. కాని ఆమెకి అవేమీ వినిపించటం లేదు.

తన కొడుకు పోవటం - అంతకన్నా ముందు తన పవిత్రమైన శరీరం, నిర్మలమైన మనస్సు కలుషితం కావటం-ఈ రెండింటికి కారకుడు-రంగరాజు.

రంగరాజు -

తన యజమాని శ్రీపతి స్నేహితుడు.

అతడిపట్ల ఆమె కేర్పడ్డ కసి, పగ, ద్వేషం ఆమెని ఉన్మత్తురాలిని చేశాయ్.

రాజమ్మ రెండేళ్ళుగా శ్రీపతి ఇంట్లో వంటపని చేస్తోంది. శ్రీపతి భార్యకు రాజమ్మమీద అంతులేని నమ్మకం, గురి. శ్రీపతికి ఆమెమీద జాలి, అభిమానం

అడపా దడపా వాళ్ళింటికొచ్చే రంగరాజుకి దానిమీద విపరీతమయిన కోర్కె!

రాజమ్మ మొగుడు నాగయ్య లారీ డ్రైవరుగా పనిచేసేవాడు. వాడి కున్నదల్లా ఒక్కటే వ్యసనం-తాగుడు. సంపాదించినదంతా వాడి తాగుడుకే సరిపోయేది. రాజమ్మ వాడిని మార్చాలని చాలా విధాలుగా ప్రయత్నించింది. కాని ఫలితం శూన్యం. ఆమెకి సంసారం నడపటం కష్టం అనిపించింది అటువంటి పరిస్థితుల్లో శ్రీపతింట్లో వంటకి కుదిరింది. వాళ్ళు రాజమ్మని వంటమనిషిలా కాకుండా ఇంట్లో మనిషిలా చూచుకోసాగారు. కష్టంవచ్చినా, సుఖం వచ్చినా వాళ్ళకి చెప్పుకునేది. దాని మొగుడు నాగయ్యని- ఉద్యోగం లోంచి త్రాగి లారీ నడుపుతున్నాడన్న నెపంతో తీసేసినప్పుడు - శ్రీపతే ఆమె పరిస్థితికి జాలిపడి రంగరాజు కారు డ్రైవరుగా కుదిర్చాడు.

రంగరాజు, తరచుగా శ్రీపతింటికి వస్తుండేవాడు. అతడికి వాళ్ళింట్లో చాలా చనువు. కాని రాజమ్మకు మాత్రం అతడంటే ఎంతమాత్రం గిట్టేది కాదు. కారణం-అతడి ఆకలి చూపులు, కొంటెగా కన్నుగీటటం, ద్వంద్వార్థపు మాటలు. అతడిని చూస్తేనే తగని చిరాగ్గా వుండేది.

"కాని తనేం చెయ్యగలదు? ఆ ఇంట్లో తను వంట మనిషి మాత్రమే" అని సరిపెట్టుకోసాగింది. అందుకే అతడిని, అతడి చేష్టల్ని పట్టించుకోవటం మానేసింది.

కాని అతడే - తరచుగా రావటం, ఏదో వంకతో మాట్లాడటం, మాట్లా డించటం మొదలెట్టాడు.

రాజమ్మకి తెలుసు - అతడివల్ల తనకెప్పటికైనా ముప్పు తప్పదని. కాని ఆ రోజు ఇంత త్వరగా వస్తుందని అనుకోలేదు. / ఆ రోజు ఉదయం అత నొచ్చేసరికి ఇంట్లో ఎవరూలేరు. శ్రీపతి బయటికెళ్ళాడు-భార్య వూరెళ్ళింది. రాజమ్మ వంటగదిలో పనిలో తలమునకలుగా వుంది. అంతలో తలుపు చప్పుడైంది.

వెళ్లి తలుపు తీసి పులిని చూసిన మేకలా భయపడ్డది - వచ్చిన రంగ రాజుని. చూసి.

భయం భయంగానే అంది - "అయ్యగారింట్లో లేరు" అని.

"అమ్మగారూ! అనుమానంగా అడిగాడు రంగరాజు.

"ఊరెళ్ళారు.'

"సర్లే, నువ్వెళ్లి నీ పన్చూసుకో. నే కాసేపు కూకుని శ్రీపతి వత్తాడేమో చూసి యెల్తా" అన్నాడు లోపలికి అడుగెడుతూ.

"దయచేసి వెళ్లి, అయ్యగారొచ్చాక రండి" అని చెప్పాలనుకుంది. కాని, అది తన తొందరపాటవుతుంది. శ్రీపతికి తెలిస్తే మరోవిధంగా పరిణ మించవచ్చు.

అందుకే మౌనంగా వంటింట్లోకి నడిచింది. పది నిముషాల తర్వాత, వెనకాల అలికిడయి వులిక్కిపడి చూసింది. రంగరాజు తలుపు పట్టుకుని నిలబడున్నాడు. చూపుల్లో ఆకలి, నవ్వులో క్రూరత్వం. మొహంలోని మొరటుతనం - రాజమ్మని భయపెట్టాయి.

ఏమీ మాట్లాడకుండా భయంగా ఒక మూలగా వొదిగి నిలబడింది. మనిషి భయంతో కంపించేటప్పుడు, ఏదోచేయాలన్న ఆవేశంలో వున్నప్పుడు నోటివెంట మాటలు రావు. కొన్ని క్షణాలు ఇద్దరూ అలాగే నిలబడ్డారు.

రంగరాజు ముందుగా తేరుకుని, ముందుకు రావాలని ప్రయత్నిస్తూ, "ఎవ్వరూ లేరుగా-దా-నా ముచ్చటతీర్చు, నీకేంకావాలో అడుగు" అన్నాడు

"దయచేసి వెళ్లిపొండి - నేనలాంటి దాన్నికాదు" భయంగా, దూరం దూరంగా జరుగుతూ అంది రాజమ్మ.

రంగరాజు నవ్వాడు-నవ్వి, "ఆ మాటకొస్తే, నేను అలాంటోడిని కాను, ఎన్నాళ్ళనించో నీమీద కోర్కె-పెంచుకున్నా. ఈ నాటికి అవకాశం వచ్చింది" అంటూ పూర్తిగా వంటగదిలో కొచ్చేశాడు.

రాజమ్మకేం చెయ్యాలో తోచలేదు. అతడిని తప్పించుకుని బయటకి పరిగెత్తాలని ప్రయత్నించింది.

అదే అదనుగా రంగరాజు చటుక్కున రాజమ్మని పట్టుకుని బలంగా గుండెల కత్తుకున్నాడు.

x x x

నడుస్తున్న రాజమ్మ కాళ్లు ఠక్కున ఆగినాయ్. ఎదురుగా రంగరాజు బంగళా.

ఆలోచనలకి స్వస్తిచెప్పి, ఆవేశంగా లోనికెళ్లింది.

రంగరాజు గదిలో తీరుబడిగా కూర్చుని ఫోన్లో ఎవరితోనో మాట్లాడు తున్నాడు.

"అవునండి! కుర్రనాయాలు ఏడనించి వచ్చిండో, కారు కింద పడ్డా డండి! అం-చనిపోయాడండి! అవును - కారుని అక్కడే వదిలేసి వచ్చా! డ్రైవరు నాగయ్యని పంపించాను - వచ్చాడా? ఆడి పేర్న కేసు బుక్ చెయ్యండి! జైలు సిచ్చపడితే - జైల్లో కూకుంటాడు. ఏమవుద్ది? ... అలాగే ... ఈ గొడవంతా అయ్యాక ఓసారి తమరు నన్ను కలవండి. మీ కష్టం వుంచుకోను...మంచిది - వుంటాను మరి."

ఫోను పెట్టేసి వెనక్కి తిరిగాడు రంగరాజు.

ఎదురుగా రాజమ్మ ! కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ నిలబడుంది.

రంగరాజు ఒక్క క్షణం కంగారుపడ్డాడు.

కాని మరుక్షణం తేరుకుని, "జరిగిందేదో జరిగింది. ఎంతకావాలో సెప్పు-ఇచ్చేస్తాను" అన్నాడు గొప్పగా నవ్వుతూ.

రాజమ్మ అలాగే నిలబడుంది. ఏడుస్తూనే వుంది. ఆమె ఏం మాట్లాడ లేదు.

ఆమె మౌనంతో రంగరాజుకి కాస్త ధైర్యం వచ్చి భయపడక! ఎవ్వరికీ తెలీదు - ఎంత కావాలి?" అన్నాడు.

రాజమ్మ అసహ్యంగా అతడివంక చూసి, నా భర్తెక్కడ" అనిఅడిగింది.

"ఆడు యాక్సిడెంటు చేశాడు. కుర్రవాణ్ణి చంపేశాడు. పోలీసోళ్లు పట్టుకెళ్ళారు."

"అంతా అబద్ధం. ఆ యాక్సిడెంటు చేసింది నువ్వు. పిల్లాడిని చంపింది నువ్వు."

"అని అంటే ఎవరు నమ్ముతారు? నీ మాటెవరింటారు?" హుందాగా అన్నాడు రంగరాజు.

"చనిపోయిన ఆ పిల్లాడెవడో తెల్సా?" కళ్ళు తుడుచుకుని అడిగింది.

"తెలీదు."

"నా కొడుకు."

రంగరాజు ఆశ్చర్యపోయాడు. "నిజంగా నాకు తెలీదు" అంటున్నప్పుడు అతడి కంఠంలో ఎటువంటి మార్పూలేదు.

రాజమ్మ విషాదంగా నవ్వి, "తెలీక చేసినవి కొన్ని - తెల్సి చేసినవి మరికొన్ని. తెలిసి నా శీలాన్ని దోచావ్ - తెలీక నా ఒక్కగానొక్క కొడుకుని బలితీసుకున్నావ్. కావాలని నేరం నా భర్తమీద మోపి జైలుకు పంపావ్. రంగరాజూ! గుర్తుపెట్టుకో-నా కడుపులో చిచ్చు రగిల్చావ్. అది

అరదు! మారణహోమమై నిన్నూ, నీ ఆస్తినీ, నీ హోదానీ మసిచేస్తుంది. ఆస్తి, అంతస్తు అన్నీపోయి దిక్కులేని జీవితం గడుపుతావ్. ఇది నా శాపం గుర్తుపెట్టుకో'' అనేసి వెనక్కి తిరిగి, మెట్లు దిగి వెళ్ళిపోయింది.

రంగరాజు పగలబడి నవ్వాడు-"శాపం! రాజమ్మ నాకు శాపంపెట్టింది పిచ్చిది! శాపమట - శాపం!''

అలా పగలబడి నవ్వుతూనే వున్నాడు చాలాసేపు.

పాంచాలిని పరాభవించిన కౌరవ సామ్రాజ్యం నామరూపాల్లేకుండా నాశనమైంది.

సీత కడుపులో చిచ్చురేపిన రావణుడి లంక మట్టిలో కల్సిపోయింది.

అనార్కలీకి సజీవ సమాధి కట్టించిన మొగలాయి సామ్రాజ్యం మరో సమాధిగా మారింది.

ఒక అబల కడుపులో రేగిన చిచ్చులో-రాజులు, చక్రవర్తులు, సామ్రాజ్యాలు, వారి అష్టయిశ్వర్యాలు, వారి చతురంగబలాలు కాలి, మసైనప్పుడు ఈ రంగరాజు, వాడి చిన్నబంగళా, లక్షలాస్థి ఏ మూలకి?

ఇవన్నీ ఆ ఊరి జనం వూహ కందని విషయాలు.

వాళ్ళకి తెలిసిందల్లా - రాజమ్మ పాడుబడ్డ బావిలో పడి ఆత్మహత్య చేసుకుందని.

ఆమె మరణవార్త ఆ ఊరిని పొగమంచులా కమ్మేసింది. *

( నీలిమ మాసపత్రిక, 1979 )

# తస్మాత్ జాగ్రత్త...

'కుడికన్ను అదిరితే ఏమిటి ఫలితం' అనడిగాడు ఏమీతెలీని సత్యన్నారాయణ, సర్వం తెలిసిన సూర్యనారాయణని.

'కార్యసిద్ధి, ధన లాభం, పరస్త్రీతో సంభోగం....'చెప్పుకు పోతున్నాడు సూర్యనారాయణ.

'ఎడం కన్ను అదిరితేనో' రెట్టించాడు సత్యన్నారాయణ.

'కార్యవిఫలం, ధన నష్టం, పర పురుషుడితో ..........'

సత్యన్నారాయణ ఎడం కన్నుని చేత్తో మూసుకుంటూ పరిగెత్తికెళ్ళాడు భయంగా.